# తెల్లారింది

వీధి గడపలో కూర్చున్న తులసి మొగుడు రాకకోసం చాలసేపట్నించి ఎదురు చూస్తున్నది. ఇంట్లోని దీపం వెల్తురు గడపదాకా సాగి తరవాత చీకట్లో కలిసిపోతున్నది. వర్షం హోరుకి మనుషులు వస్తున్న అలికిడేదీ వినిపించడం లేదు. వీధుల్లో వర్షం నీరు జలజల పారుతున్నది. ఆ నీటిలో నడుచుకుంటూ మొగుడు వస్తాడని కళ్లార్పకుండా చూస్తున్నది తులసి. వాన తుంపర్లకి తడుస్తున్నది కాని లోపలికి వెళ్లకుండా, కదలకుండా వెతికి వెతికి వాడు వచ్చే దారి చూస్తున్నది. మనిషి కదులుతున్నట్టే కదులుతున్నది చీకటి.

చలి ఎక్కువవుతుంటే పైటకొంగు ఒళ్లంతా బిగువున చుట్టుకుని కూర్చున్నది. వాన తుంపర్లకి మట్టి గడప తడిసి పదునయింది. చిన్నరెక్క చీమలో, పురుగులో కాళ్లమీద పాకుతున్నాయి. సాయంత్రమే వస్తానన్న మావ ఇంతదాకా రాలేదు. నిన్న కూడా, మొన్న కూడా ఇంతే.

చలికి మరింత ముడుచుకు కూర్చున్నది తులసి. చేత్తో ముఖం మీది తుంపర

తుడుచుకుని చీకట్లో మొగుడు వచ్చే దార్లోకి చూస్తున్నది.

వీధి ఇళ్లల్లో ఎక్కడా దీపం వెల్తురు కనిపించటం లేదు. చంటిపిల్లల ఏడుపు వినిపించటం లేదు. పైకప్పు తాటికమ్మల మీద పడుతున్న వాన చప్పుడు, దానికి తోడై గాలికి ఊగిపోతున్న చెట్ల చప్పుడు, వానకి మరింత పేట్రేగిపోయి చెట్లమీద అరుస్తున్న కీచురాళ్ల చప్పుడు, ఎత్తుపల్లాలుగా ఉన్న వీధిలోంచి పారుతున్న వర్షం నీటి చప్పుడు. ఆ చప్పుళ్ల మధ్య మొగుడు నడక చప్పుడు కోసం చెవులు రిక్కించి వింటున్నది తులసి.

శీరాములు ఈ రోజు కూడా పగటిపూట వచ్చి పెళ్లాన్ని చూడలేకపోయి నందుకు విసుక్కున్నాడు. దమ్ములవుతున్నాయి. వరినాట్లు వెయ్యటం. పొలం పని. మూడేళ్లు వానలు లేక పంటలు పోయాయి ఈ ఏడు వానలు పాలిస్తున్నాయి. తొలికోడి కూసిందో లేదో పని మొదలు. ఎడ్లకి కుడుతులు పెట్టడం, నాగళ్లూ నక్కులూ సర్దుకోవటం, పొలం బురదలో దిగటం. ఎద్దుల్ని కొరడాలతో కొట్టి కొట్టి చేతులూ, భుజాలూ నొప్పులెడతాయి. అరిచి అరిచి గొంతు పడిపోతుంది. పొలం గట్లమీదే తిళ్లు తినటం. నోటిలోని నీరు ఉమ్మకుండానే పని మళ్లీ అందుకోవటం, బుగత ఏది చెబితే అది నోరెత్తకుండా చెయ్యటం. అబ్బ చచ్చిపోవడానికి కూడా తీరుబాటు చిక్కదు. అయినా శీరాములు దొంగ ఎత్తులేసి రెండుసార్లు పెళ్లాన్ని చూడాలని పని మధ్య ఇంటికి వచ్చాడు. పెళ్లాం కనబడలేదు. ఒకసారేమో నీళ్లబిందెతో నూతికి వెళ్లిందని చెప్పింది తల్లి. మరొకసారేమో ఆవుకు గడ్డికోసం తోటలవేపు వెళ్లింది. శీరాములుకి చికాకు అయ్యేది. కోపం వచ్చేది. గొణుక్కుంటూ తిరిగి పొలం పనికి వెళ్లిపోయేవాడు. పగటి వెలుతురులో చూస్తే తులసి ఎలా కనబడుతుందో వాడికి తెలీదు. కాపరానికి తీసికొచ్చి పదిహేను దినాలయింది. వచ్చిన దగ్గరనించి శీరాములు పెళ్లాన్ని పగటిపూట ఇంతవరకు చూడనేలేదు.

రోజూ వచ్చే దార్లోంచి ఈ రోజు రాలేదు శీరాములు. దొంగఅడుగులు వేసుకుంటూ, తాటికమ్మగొడుగు దూరంగా దాచేసి మెల్లిగా వెనకనించి వచ్చి తులసి భుజాలు గట్టిగా పట్టుకున్నాడు. భయంతో వణికి కేకేసింది తులసి. తులుక్కుపడి నిలబడి లోపలికి పారిపోతుంటే ముఖం మీద వాన నీటిబొట్లు పడ్డాయి. మొగుడి చేతుల బలాన్ని, ఆ తరవాత వొళ్లు వాసనని పోల్చింది. కేకేసినందుకు నాలిక కరుచుకుంది. జారిపోయి తప్పించుకుని లోపలికి పారిపోయింది. వెనక్కి తిరిగి చూసింది. బాగా తడిసిపోయి ఉన్నాడు.

"గొడుగేసుకోలేదా మాఁవా?" అంది.

"అది వోనా, కుండపోతగాని" అని చేతులతోనే కాళ్లూ చేతులూ తుడుచుకున్నాడు. పంచకి వెళ్లి వొళ్లు తుడుచుకుని పంచె పిండుకుని లోపల అడుగుపెట్టాడు.

మొగుడు ముఖంలో సరదా చూసింది తులసి. చిన్న ఏనుగు కళ్లులాంటి కళ్లు మెరుస్తున్నాయి. చప్పిడిముక్కు. వెడల్పాటి ముఖం. తడిసినా పొడుచుకు నుంచున్న పొట్టి జుత్తు. అలాగే చూసింది కొంతసేపు. 'దొంగ' అంది, తనకళ్లు కప్పి దొంగలా వచ్చినందుకు.

"ఒళ్లు తుడుసుకో" అని తన కోక ఇచ్చింది. ఆ చిన్న ఇంట్లోనే ఒక పక్క పొయ్యి. ఆ పొయ్యి పక్కనే తొక్కు, ఆకులూ. దీపం దగ్గర ముట్టించిన తొక్కును పొయ్యిలో పెట్టి కర్రలు పెట్టింది. ఒక చేత్తో తొలుగు మీది పంచె తీసుకుని, చీరని కింద పడేసి, తడి పంచెని మార్చుకుంటూంటే మొగుడివేపే చూసింది తులసి. తరవాత వచ్చి ఆ తడిపంచె బయట పిండి తెచ్చి చిలక్కొయ్యలకి ఆరగట్టింది. కర్రలు అంటుకోవటం లేదని పొయ్యి ముందు కూర్చుంది. ఎండుకర్రల్లేవు. తొక్కుకూడా లేదు. ఊదుతూ పొయ్యిలో కర్రలు సర్దుతున్నది.

చలితో వణికిపోతున్న మొగుడి కోసం ఉడుకు నీళ్లు కాచాలి. మంట చిన్నగా అంటుకోవటంతోనే ఒక అయిలం పైన మట్టికుండ పెట్టింది. ముందే నీళ్లు కాచిపెడితే వాడు వచ్చేవేళకి చల్లారి పోతున్నాయి. అందుకని వచ్చిన తరవాత మంటపెట్టింది. కర్రలుంటే పొయ్యిమీద నీళ్లు సలసల కాగనిచ్చేది. కర్రలు లేవు. దానికి తోడు వరసగా ఒక పూట విడిచి ఒక పూట విడవక వానలు.

"తులసే, ఇయ్యాళ ఉడుకునీళ్లొద్దు."

"శా, పోసుకో మాఁవా" అంది తులసి. కోప్పడింది కూడా. ఆ పిల్లకి బాగా గుర్తు. రైతు పనినించి అయ్య వచ్చేవేళకి తల్లి ఉడుకు నీళ్లు పెట్టేది. అయ్య స్నానం చేసేవాడు.

సరిగ్గా మంట అంటుకోక ఇంటినిండా పొగ కమ్ముకుంది.

"ఒద్దంటే నీక్కాదా" అని పొయ్యి దగ్గర కూర్చున్న తులసి రెక్క అందుకున్నాడు శీరాములు. వదిలించుకునేందుకు తులసి పాట్లు పడుతుంటే రెండో చేత్తో వీధి తలుపు మూసి గొళ్లెం పెట్టాడు. తప్పించుకోవాలని "తలుపు" అని తెరిచి ఉన్న పెరటి తలుపు వైపు ముఖం సాగించి చూసింది తులసి. శీరాములు లెక్క చేయలేదు. పెరట్లో పంచన

ఆవు ఉంటుంది.

మొన్న మొన్నటిదాకా శీరాములు బుగతగారి ఇంట్లోనే రాత్రి పూట ఉండేవాడు. అక్కడే నిద్రపోయేవాడు. పెళ్లి చేసుకుని పెళ్లాన్ని తీసుకువచ్చిన దగ్గిరనించీ ఇంటికి వస్తున్నాడు. శీరాములు తల్లి ఒక్కర్తే ఉండేది. కోడల్ని తెచ్చిన తరవాత శీరాములు తల్లి ఆ వీధిలోనే వాళ్లింటికి నాలుగిళ్లు పడమరగా ఉన్న ఎంకమ్మ గడపలో పడుకుంటున్నది. ఎంకమ్మ కొడుకూ కోడలూ పిల్లలూ అంతా చాలా దినాలకిందటే సీలేరు వెళ్లిపోయారు. ఎంకమ్మకు తోడున్నట్టూ ఉంటుంది. కొడుకూ కోడలూ కాపురం చేసుకుంటున్నట్టూ అవుతుందని శీరాములు తల్లి రాత్రిళ్లు ఎంకమ్మ దగ్గిరికి వెళ్లిపోతుంది.

శీరాములు చేతుల్లోంచి జారిపోవడానికి తులసి ఎత్తులు వేస్తున్నది. శీరాములు చిక్కించుకుని వదల్లేదు. దొరికిన కాడికి బుగ్గ కరిచాడు. పళ్లతో జుత్తు పట్టుకున్నాడు. రెండుచేతులవేళ్లమధ్యా నడుం బిగించాడు. తలతో దాని ఒంటిమీద చీరను కిందికి జారలాగాడు. దాని గుండె మీద నుదురు బలంగా అద్దాడు. పెదాలు కొరికాడు. రొమ్ము అంతటినీ గుండెల్లో ఇరికించి ఎముకలు కరకరలాడేట్టు అదుముకున్నాడు. కుమ్మరి చేతుల్లో మట్టి ముద్దలా అయిపోయింది వాడి చేతుల్లో తులసి. బాధగా ఉంది. అయినా ఇష్టంగా ఉంది. కండరాల బలమూ, ఎముకల బిగువూ ఉంది శీరాములుకి. తులసికి ఎత్తులు తెలుసు. జారిపోతుంది. తప్పించుకుంటుంది. తన చేవ చూపిస్తుంది. ఒకంతట దొరకదు. లొంగదు. దాంతో శీరాములుకి పౌరుషం పుట్టుకొస్తుంది. జంతువులా పట్టుకుంటాడు. అమాంతం తులసిని రెండు చేతులతో ఎత్తుకుని కింద చల్లని మట్టినేల మీద మెల్లగా దించి పక్కనేపడ్డాడు. మొగుడు తనమీదికి రాకుండా నేలమీద జారిపోతున్నది తులసి. కిందా మీదా అవుతున్నారు. గిర్రున తిరిగిపోతున్నారు. దాని తలవేపు వాడికాళ్లు. వాడి కాళ్ల మధ్య దాని మెడ. బోర్లా పడేశాడు. వెన్నెముక పూసపూసకి గెడ్డంతో రాసాడు. మెడమీద ముద్దులు పెట్టుకున్నాడు. మళ్లీ జారిపోయింది. నవ్వూ పంతమూ. శీరాములుకి సిగ్గయింది. దాన్ని గట్టిగా కాళ్లతో, చేతులతో కదలకుండా కట్టేయాలను కున్నాడు. తులసి జారుతూ, జారుస్తూ పొయ్యి దాకా లాక్కెళ్లింది. అక్కడ "కాల్తుంది మాఁవా" అని మొగుణ్ణి కాళ్లతో వెనక్కి తోసేసింది. చెమట్లు కక్కుతూఉంది ఒళ్లు. తెగ అలిసిపోయారు ఇద్దరూ.

ఒక్కసారి దొర్లి గోడ దగ్గిర ఆగిపోయాడు శీరాములు. తులసి కూర్చుని కొప్పు సర్దుకుని చూసి నవ్వింది.

"తులసే, బొంత ఇక్కడేసేయ్" అన్నాడు.

తనకి చిక్కకుండా వదిలించుకున్నందుకు శీరాములుకు నిరాశగా ఉంది. అలసిపోతున్నాడు. కలిస్తే వెంటనే నిద్ర ముంచుకొస్తుంది. తెల్లారే వరకూ మెలుకవే రాదు. అసలు శీరాములు మెలుకువ వచ్చే వరకు ఎప్పుడూ నిద్రపోలేదు. వేకువ జామునే కొన్నిసార్లు తొలికోడి కూయకమునుపే-- కురమయ్య వచ్చి "బావు రమ్మంతన్నాడురా సీరాఁవులు, బేగీ రమ్మంతన్నాడు" అని కేకలేసి లేపుతాడు. నిద్రలో జోగుతూనే శీరాములు పది పన్నెండేళ్ల కురమయ్యతో వెళ్లిపోతాడు బుగత పనికి.

"కూకో, మాఁవా?" అంది తులసి.

నిన్న రాత్రి శీరాములు "ఒంట్లోన బాగులేదు" అన్నాడు. కోడిగుడ్డు తాగమన్నాది తులసి. ఉదయం లేవకముందే శీరాములు లేచి బుగత పనిలోకి వెళ్లిపోయాడు. రాత్రి మాట గుర్తు పెట్టుకుని కోడిగుడ్డు అట్టు చేసి ఉంచింది.

"తిండి తిన్నావా, తులసే." శీరాములు అడిగాడు.

"నీవేమో నడిరేతిరి తిరిగిన తరాతొస్తావు. నీనేమో గడపలో నీ కోసం కూకోవాల. ఎప్పుడు తిండి?"

"మరి తినూ. ఏంటీ పొగ!" అని తులసికి తినమనిచెప్పి ఇల్లంతా కమ్ము కుంటున్న పొగకి విసుక్కున్నాడు.

తులసి ఇంటినించి పొగ పోవటానికి వీధి తలుపు తెరిచింది.

సత్తు రేకులో అట్టు తెచ్చి శీరాములు ముందు ఉంచింది. అట్టు రెండు వేళ్లతోనూ తీసి సగం ఒకేసారి కొరికి "బావున్నాది కాని ఉప్పు లావయింది" అన్నాడు.

సత్తుకంచం ముందు పెట్టుకుంది తులసి. వంట మసితో నల్లబారిన చట్టిలోని రాగి అంబలి కంచంలో పెట్టుకుంది. కాల్చిన ఉప్పు చేపని అందుకుంది. శీరాములు వేపు తిరిగి పొయ్యి ముందే కూర్చుని తింటున్నది.

"జగ్గడు, సూరిగాడు, కుష్టారావు, ముకుందుగాడు సీలేరు పారిపోయినారు, ఎరికా?"

సాయంత్రం ఆ పేర్లే చెప్పి "సీలేరం పారిపోయినారట!" అని వాళ్ల అత్త కూడా అంది.

తులసి తెలుసుననలేదు, తెలీదన్లేదు.

శీరాములుకి కూడా సీలేరు పారిపోవాలని ఉంది. అక్కడ కూలిపని దొరుకుతుంది. పని తక్కువ. టయానికి వెళ్లి టయానికి రావాలి. మేస్త్రీ తిట్టడు. పెళ్లాంతో ఒకసారి "నేను కూడా ఎలిపోతా" అన్నాడు. అప్పుడు తులసి ఏడ్చింది.

మళ్లీ ఇప్పుడు "నేను కూడా ఎలిపోతా" అన్నాడు. అట్టు తినేసి సత్తురేకుని పెళ్లాం ముందుకు తోశాడు.

కంచంలో చెయ్యి అలాగే ఉంచేసి బాధతో చూసింది. అంతలోనే కళ్లనిండా నీళ్లు తిప్పుకుంది.

"సీ. ఏంటీ ఏడుపు. నవ్వులాటకన్నా" అన్నాడు. "ఒట్టు సీ, ఏడొద్దు" అని నవ్వాడు.

కిందటిసారి ఇట్లాగే చెబితే వెక్కి వెక్కి ఏడ్చేసింది. సీలేరుల కొలువు కుదిరినాక వచ్చి తీసుకు వెళతానన్నా ఒప్పుకోలేదు. బెంగపెట్టుకుంది. తుళ్లుతూ నవ్వే తులసి గొంతు పడిపోయేసరికి శీరాములుకి గుండె తరుక్కు పోయినట్టయింది. "ఎల్లన్లే, బెంగెట్టుకోకు" అని నచ్చజెప్పాడు. వెళదా మనుకున్న ఆ జట్టు వాళ్లంతా — శీరాములు తప్పించి — రాత్రి సీలేరు వెళ్లిపోయారు.

"సీ, ఎల్లను ఒట్టు. ఎల్తే రాత్రే — సెక్కెద్దును" అన్నాడు.

తులసి నమ్మింది. కాని తరవాత దానికి తిండి సహించలేదు. పారెయ్య కూడదని అని తింటున్నది.

శీరాములుకు బాగా అలసటగా ఉంది. కూర్చోవటం కూడా శ్రమగా ఉంది. గోడపక్క బొంత అటూ యిటూ విప్పుకుని దానిమీద ఒళ్లు చేరేశాడు.

"నీ తిండి అయిపోతే లేపు" అని నిద్ర గొంతుతో చెప్పాడు.

శీరాములుకు తిండి బుగతగారి ఇంటి దగ్గిర. వాడికి మంచి తిండే దొరుకుతుంది. ఇంటి దగ్గిర తల్లికీ, పెళ్లానికీ మాత్రం ఇంతే. ఉప్పుసేపో, ఉల్లిపాయో నంజుకోవాలి. మొదట్లో ఒక వారం పెళ్లాం ఈ అంబలీ గంజీ తాగడం, తనేమో ప్రెసిడెంటుగారి ఇంటికాడ కూరలతో తినడం — బాధపడ్డాడు. ఇప్పుడు ఆ బాధ తగ్గిపోయింది. కోడి గుడ్డు అట్టు తిన్నప్పుడు కూడా పెళ్లానికి ఒక ముక్క పెట్టాలనిపించలేదు.

శీరాములు కళ్లు బరువుగా పడిపోతున్నాయి. నేలమీద చేరగిలబడటంతోనే

ఒంటిలోని అవయవాలన్నీ ఎక్కడి వక్కడ జారిపోయాయి. హాయిగా ఉంది. సుఖంగా ఉంది.

తులసి చూసింది. మొగుడు కునుకు తీస్తున్నాడు.

వాన కురుస్తున్నది. చల్ల గాలి వీస్తున్నది. వర్షం నీరు పారుతున్నది. చలేస్తున్నది. పొయ్యి ఆరిపోయింది.

"సీరాఁవులూ! సీరాఁవులూ!" కురమయ్య గొంతు. పిలుస్తున్నాడు.

కంచం దగ్గిరనుంచి ఎంగిలిచేత్తోనే లేచి, గడపలోకి వచ్చి "తొంగున్నాడు. లేప కెల్లు" అని చెప్పింది. పెద్ద గొంతు చేస్తే ఎక్కడ కునుకు చెడిపోతుందో అని మెల్లిగా చెప్పింది.

"బావు బేగి రమ్మంతన్నాడు."

"రాడాడు, తొంగున్నాడు ఎల్లు"

"లేపి తీసికిరమ్మన్నాడు బావు."

"ఎ్రలా — ఎల్లమంతె నీక్కాదు? ఒల్లకాదని సెప్పు. ఎల్లు. ఆ పెసిడెంటు బావుకి సెప్పు. ఎల్లు" అంది. కసిరి పంపించేసింది.

కురమయ్య చిన్నవాడు. వానలో తాటి గొడుగు తలమీద టోపీలా పెట్టుకున్నాడు. వచ్చి ఎప్పుడూ శీరాముల్ని నిద్రలేపి తన వెంట తీసుకువెళ్లేవాడు. నోరెత్తలేక వెళ్లిపోయాడు.

* * *

ఆ కేకలకి కూడా శీరాములుకి తెలివి రాలేదు. కంచం ముందు మళ్లీ కూర్చుంది. తులసికి బుగతమీద కోపం వచ్చింది. కళ్లనిండా ఒక కునుకు కూడా తీయనివ్వరా ఎంత కడుపుకు చాలక కంబారితనం చేసి బతుకుతున్నా మాత్తరం? రాతిరి పెళ్లాంతో పడుకున్నప్పుడు కూడా వచ్చి లేపి తీసుకెళ్తారా?

కన్న వారింట్లో ఉన్నప్పుడు తులసి తన ఈడువాళ్లతో మొగుడు గురించి గొప్పలు చెప్పుకునేది. ఇప్పుడు మొగుడు ఇంటికి తొందరగా రాడు. తెల్లగా తూరుపు తెల్లారిందాకా ఉండడు. కొత్త ఊరు. అత్త రాత్రిపూట తిన్న వెంటనే ఎంకమ్మ దగ్గిరికి వెళ్లిపోతుంది. అప్పటినించి తులసి దిక్కులు వెతుకుతూ కూర్చుంటుంది. నిద్ర వస్తుంది. వెళ్లి నిద్రపోదు. గడపలో మొగుడు వచ్చేవరకు కూర్చుంటుంది. ఇరుగూ పొరుగూ అలికిడిలేదు. ఇంటికి ఒకరూ ఇద్దరూ ముసలీ ముతకా తప్ప ఊళ్లో ఎవ్వరూ

లేరు.

ఉత్తరాంధ్రలో వరసగా మూడేళ్లనించి వర్షాలు లేవు. పంటలు చెడి పోయాయి. తరవాత పశువులకి కూడా నీళ్లు లేకపోయాయి. రైతులు పోషించలేక పశువులని అమ్ముకున్నారు. కంబార్లను వదులుకున్నారు. పనుల్లేక జనం చెట్టుకో పిట్టగా పారిపోయారు — కొందరు భిలాయ్. కొందరు కలకత్తా. కొందరు విశాఖపట్నం. కొందరు కోరాపుట్. ఇంకా కొందరు దగ్గర దగ్గర టౌన్లలోకి — రిక్షాలు తొక్కి బతకటానికి. కూలి పనులు వెతుక్కోటానికి. రోజూ గుక్కెడు గంజి తాగటానికి.

బుగత ఆ ఊళ్లో పెద్ద రైతు అవటం మూలాన శీరాములుకు కంబారితనం పోలేదు. లేకపోతే వాడికి కూడా ఊరు వదిలి పారిపోవటం తప్పేది కాదు.

తిన్న కంచాన్ని, అంబలి చట్టిని కడిగేసి ఓ మూల పెట్టింది. చేప పొలుసు, ముళ్లూ చీపురుతో పొయ్యిలోకి తుడిచేసింది. వీధి తలుపు గడియపెట్టి వచ్చింది.

జల్లులు తగ్గి వాన నిలిచి కురుస్తున్నది. తులసికి తల్లి గుర్తు వచ్చింది. వర్షం వస్తే వాళ్ల ఇల్లు కారుతుంది. ముగ్గురు పిల్లలతో తల్లి పొరుగింటికి పోయి వాళ్ల గడపలో నిద్రపోవాలి. ఎలాంటి అవస్థ పడుతున్నారో పాపం అని విచారించింది. దుః ఖమయింది.

తల్లిమీద మనసు పెట్టుకున్నప్పుడల్లా తులసికి గుండె చెరవయిపోతుంది. తండ్రి నాటు అమోనియా సారా తాగి తాగి గుండె దబ్బలు చిల్లులు పడి చచ్చిపోయాడు. ఆ చచ్చిపోయే ముందు డాక్టరు వద్దకు తీసుకు వెళితే మందులకోసం డబ్బు అడిగాడు. తల్లి బదులు తెచ్చిందో ఏమమ్మిందో — తెచ్చింది. ఇంకా మందులకు డబ్బు కావలసి వచ్చింది. ఎంత మొత్తుకున్నా డబ్బు దొరకలేదు. తులసి దగ్గర, తల్లికి తెలియకుండా దాచుకున్న డబ్బు, ఇరవై రూపాయలు ఉంది. కాని తన దగ్గర ఉన్నట్టు తల్లితో చెప్పలేదు. పది రూపాయల కోసం తల్లి పట్టరాని వాళ్ల కాళ్లు పట్టింది. గిలగిల కొట్టుకుంది. తండ్రి కొన ఊపిరితో గింజుకుని గింజుకుని చనిపోయాడు. కాని తులసి ఇవ్వలేదు. తండ్రిమీద పడి తల్లి గుండె బాదుకుని ఏడుస్తూంటే తలసికి బాధ అయింది. తన దగ్గర ఉన్న డబ్బు ఇచ్చేసి ఉంటే బావుండును అనిపించింది. ఆ ఇరవై రూపాయలు తులసి అప్పుడొక పావలా ఇప్పుడొక అర్ధా మిగిల్చి దాచింది. పది పైసల కోసం చాలా అబద్ధాలు కూడా చెప్పింది. కొన్నిసార్లు పట్టుబడిపోయి తల్లిచేత తిట్లూ తాపులూ తిన్నది కూడా. తాగి ఒళ్లు మరిచి వస్తే తండ్రి దగ్గరనించి కూడా డబ్బులు

దొంగిలించింది. అలా కూడబెట్టింది. ఆ పైసలు ఉంచిన చోటు తులసికి తప్పించి భగవంతుడికి సయితం తెలీదు. చివరికి కాపరానికి అత్తవారింటికి వస్తున్నప్పుడు ఆ పైసలు తెచ్చుకుంది. ఆ డబ్బుని ఎప్పుడు చూసినా, అది తల్లికి ఇస్తే తండ్రి బతికేవాడేమో అన్న ఆలోచన వస్తుంది. అయినా ఎంతో కాలం బతికేవాడు కాదు. చచ్చిపోయేవాడు. ఇచ్చి ఉంటే తన డబ్బు మాత్రం పోయేది అనుకుంటుంది. తన సొమ్ము మిగిలినందుకు సంతోషిస్తుంది.

తొలిరాత్రి తులసి తను తెచ్చిన సంపద గురించి మొగుడుతో చెప్పింది. చాలా గర్వపడింది. ఆ ఇరవై రూపాయలతో ఒక సామ్రాజ్యమే దొరుకుతుందనుకుంది. మొగుణ్ణి ఒక చొక్కా కుట్టించుకోమంది. జోడు కొనుక్కోమంది. గొడుగు ఒకటి తెచ్చుకోమంది. పంచెల జత తీసుకోమంది. ఒంట్లో బాగులేదంటే రోజూ కోడి గుడ్డు తాగమంది. డాక్టరు దగ్గర ఇంజక్షన్ తీసుకో మంది.

తల్లిని గురించి బెంగపడిందల్లా ఆ సంగతి మరిచిపోయింది. మొగుడు నిద్రపోతుంటే చూసింది. లేపమన్నాడు గదా అని లేపబోయింది. లేవలేదు. బోర్లా పడుకున్నాడు. తలకింద రెండు చేతులూ పెట్టుకున్నాడు. మళ్లీ లేపి చూసింది. లేవలేదు. తెలివి రాలేదు. ఆ నిద్ర చూస్తుంటే బలవంతంగా లేప కూడదనిపించింది. చలేస్తున్నట్టుందని తొలుగుమీదున్న దాని కోక తెచ్చి కప్పింది. దీపం చల్లార్చి వచ్చింది. మొగుణ్ణి ఆనుకుని పడుకుంది. వాడి మీదికి ఒక కాలు వేసుకుంది. తులసి రొమ్ముకు వాడి భుజమూ వీపూ — చల్లగా తాకుతున్నాయి. వాడి మెడని ఒక చేత్తో చుట్టేసింది. చీరని ఇద్దరికి సరిపడేట్టు కప్పుకుంది. ఆ ఒంటివాసన బాగుంది తులసికి. ముట్టుకుంటుంటే ఒళ్లు పులకరిస్తున్నది. ఒంటిలోని రక్తం అమృతమయిపోతుంది. నరాల చురుకు హెచ్చుతున్నది.

బయట వాన. ఆ చప్పుడు. కప్పలూ చీకటి పిట్టలూ సందడి. ఆ సందడి నించి మనిషి గొంతు. ముందు ఏమిటో ఎక్కడో అనుకుంది. తరవాత స్పష్టంగా వినిపించింది. 'శీరాములూ, శీరాములూ' అని పిలుస్తున్నాడు. పెద్ద మనిషి గొంతు. తలుపు తడుతున్నాడు. పలక్కపోతే ఇంకా గట్టిగా తలుపుమీద బాదుతాడని ముందు పలికింది. అగ్గిపెట్టె వెతికింది. దీపం వెలిగించింది. ద్వారం వద్దకి వచ్చి "ఓరు?' అంది.

తలుపు తెరిచిందో లేదో టార్చిలైట్ కాంతి పడింది గడపలో.

"నేను మేష్టర్ని. శీరాముల్ని లేపమ్మా" అన్నాడు కొంచెం వెనక్కి తగ్గి.

"అలసిపోయి వచ్చి తొంగున్నాడు బాబూ" అంది, మర్యాదగా.

"అది కాదమ్మా, చెరువు గట్టు తెగింది. రైతులంతా పరిగెత్తుతున్నారు — ఒక గంట పని, లేపమ్మా" అన్నాడు. ఆ గొంతూ ఆ మాటతీరూ తులసికి తెలుసును. ఇంతకు ముందు రెండు మూడుసార్లు ఇలాగే రాత్రి పూటో, వేకువ జామునో వచ్చి లేపుకు వెళ్లాడు. ఈ స్కూలు మేష్టరు ప్రసిడెంటు ఇంట్లోనే ఎప్పుడూ ఉంటాడు. వాళ్ల ఇంటి పని కూడా చేస్తాడు.

మారు మాటాడలేదు. వచ్చి శీరాములుని పట్టుకుని కుదిపి లేపింది. "ప్రెసిడెంటు బాబు పిలుస్తున్నాడట లెగు. సెరువుగట్టు కొట్టేసినాదట. మేష్టరు బాబు వచ్చినాడు లెగు" అని చెబుతున్నది.

నిద్రలో శీరాములుకి తులసి గొంతు వినిపిస్తున్నది. పెసిరెంటు అన్న మాట తెలుస్తున్నది. కాని ఒళ్లు కూడదీసుకోలేక పోతున్నాడు. కదల్లేక పోతున్నాడు. కనురెప్పలు ఎంత ప్రయత్నిస్తున్నా లేపలేకపోతున్నాడు. అలసట. అప్పటికి దూరంనించి మేష్టరు గొంతుకూడా వినిపించింది. రెండు మూడు నిమిషాలు శక్తులన్నీ ఒకటొకటే కూడదీసుకున్నాడు. చేతులతో కళ్లు పదేపదే నులుము కున్నాడు. మసకంతా పోయి చూపు వచ్చింది. ముందున్న వస్తువులూ కనిపించాయి. లేచి పెళ్లాంతో ఏం చెప్పకుండానే వెళ్లిపోయాడు. మేష్టరు గొడుగు వెనకాల శీరాములు తాటి గొడుగుతో ముందుకు నడిచాడు.

* * *

తినకుండా ఉంటే తులసి ఎంత సేపన్నా నిద్రపోకుండా కూచోగలిగేది. కమ్ముకు వస్తున్న నిద్ర మబ్బుని ఆపుకుని చాలాసేపు కూర్చుంది. దీపంమళ్లీ వెలిగించి ఆముదం పోసి వచ్చింది. తలుపు తెరిచే ఉంచింది. గోడకు వాలి కూర్చుని వాకిట్లోకి చూస్తున్నది. అట్లా చూసి చూసి తెలీకుండానే పక్కమీద వాలిపోయింది తులసి.

గండి పూడ్చిన తరవాత వచ్చాడు శీరాములు. ఊరు జనమంతా వచ్చారు. చాలాసేపు పట్టింది. చీకట్లోనే వానలో తడిసి పని పూర్తి చేశారు. ఇంక ఎంతో రాతిరిలేదు. వాన జోరు తగ్గింది. తడిగుడ్డలతో చలికి వణికిపోతూ ఇంట్లో అడుగు పెట్టాడు. దీపం ప్రమిద కడుపులో వత్తి కాలుతున్నది. చిలక కొయ్యలకి ఆరేసిన పంచెతో ఒళ్లంతా ఒత్తుకున్నాడు. తులసి ఒళ్లు మరచి నిద్రపోతున్నది. ఇంతసేపు

చూసి ఇప్పుడే కునుకు పట్టినట్టుంది. పని చేస్తున్నంతసేపూ పెళ్లాన్నే మతిలేసుకున్నాడు. కనీసం తల్లినన్నా లేపి తోడుండమని చెప్పి రాలేదు. ఈసారి బుగత మీద శీరాములుకి కోపమొచ్చింది.

తులసి కాపరానికి వచ్చిందాకా శీరాములుకి బుగత అంటే తండ్రిలాంటి వాడు. దేవుడు లాంటివాడు. కురమయ్య అంత వయస్సునించి బుగత దగ్గరే శీరాములు కంబారిగా ఉంటున్నాడు. పనీపాటా నేర్చుకున్నాడు. ఇంట్లోని మనిషిలాగ మెలిగాడు. బుగత కూడా "ఇంటి మనిషి కంటే నమ్మకస్తుడు. ఆడికి ఈ పని చెయ్యిరా అని చెప్పనక్కర్లేదు. పేరుకి కంబారిగాని పెత్తనమంతా ఆడిదే. మనిషంటే నికార్సయిన మనిషి. ఒకటోరకం మనిషి" అని పొగిడేవాడు. పెళ్లాం వచ్చిన తరవాత శీరాములు అప్పుడప్పుడు పని మధ్యలో ఇంటి దారి పడుతుండటం కనిపెట్టి బుగత కోప్పడ్డాడు. "పెళ్లాం దగ్గిర కూకుంటే కూడు రాదురా. పెళ్లాలని తిని మనుషులు బతకర్రా. పెళ్లాలతో తైతక్కలాడితే కడుపు నిండదురా శీరాములూ" అన్నాడు. ఆ మాటలు శీరాములు గుండెలో గుచ్చుకున్నాయి. అందుకే వాడు మొదటిసారి సీలేరు పారిపోవాలనుకున్నాడు.

బుగతకు ఒక కూతురుంది. ఆ పిల్లని చిన్నప్పుడు, శీరాములు ఎత్తుకున్నాడు. ఆడించాడు. శీరాములు ముందు ఆ పిల్ల గౌన్లు తొడుక్కోకుండా తిరిగింది. ఆ పిల్లకి నాలుగు నెలల కిందటే పెళ్లిచేశాడు బుగత. అల్లుడు కాలేజీ చదువు పూర్తి చేశాడు. ఉద్యోగం లేదు. పది దినాల క్రితం నించీ మామగారింటే ఉన్నాడు. ఆ అల్లుడు వచ్చినప్పుడు ఆ పిల్లా, దాని మొగుడూ ఒకళ్ల నొకళ్లు వదిలి ఉండరు. నవ్వుకుంటారు. కలిసే పొలానికి వెళ్తారు. తోటలకి కలిసే వెళ్తారు. ఏ పనీ చెయ్యరు. గంటల తరబడి తలుపు వేసుకుని రేడియో పాటలు వినుకుంటూ గదిలో ఉంటారు. వాళ్లని చూసినప్పుడల్లా తులసి మతిబడుతుంది. ఆ అల్లుణ్ణి బుగత "పెళ్లాలతో తైతక్క లాడితే కడుపు నిండదురా! అని ఎందుకనడో, పెళ్లాలని తిని మనుషులు బతకర్రా" అని ఎందుకు చెప్పడో?

కళ్లు తెరిచినా, కళ్లు మూసినా శీరాములుకి వాళ్లిద్దరే కనిపిస్తారు. కాపరానికి పెళ్లాం వచ్చి రెండు వారాలయినా పెళ్లాన్ని పగటి వెలుతురులో ఇంతవరకు చూడలేదు శీరాములు. చూడాలని వారం రోజులనుంచి అనుకుంటూ కూడా చూడలేక పోయాడు.

కాపరానికి వచ్చిన రెండో రోజే తులసి అడిగింది. "పొలానికి పన్లోకి తీసికెల్లవా, మాఁవా!" అని. ఒక పగలంతా మొగుడు కనిపించక పోయేసరికి గిలగిల్లాడిపోయింది. తులసి అట్లా అడిగేసరికి శీరాములుకు గుండె తొలుచుకుపోతున్నట్టు అయింది. "ఆళ్లు మనుషులు కారు. అటు రాకు. మొదవకి గడ్డితే. ఇంటి పన్సూసుకో. అమ్మకి తోడుండు. దానికి ఆ కాలు ఇరక్క పోతే పదిమంది పని సేసేది. ఆ బగవంతుడు దాని కాలు ఇరిసినాడు" అని తల్లి మోకాలు ఎముక ఏడాది క్రితం విరిగిపోయినందుకు బాధపడ్డాడు. తల్లి కాలే విరక్కపోతే తులసిని ఇంత తొందరగా కాపరానికి తెచ్చేవారు కాదు.

తులసికి మొగుడు చెప్పిందంతా అర్థమయింది. మళ్లీ ఆ తలంపే పెట్టుకోలేదు.

తడిసిపోయిన పంచె విడవటానికి పొడిపంచె కోసం పెట్టె దగ్గిరకి వచ్చాడు. తెరిచాడు. కట్టుకో బుద్ధికాలేదు. పైన పెట్టాడు. ఇందాకా ఆరేసిన పంచెనే — ఇంకా పొడిగా ఎండకపోయినా — తడితడిగా ఉన్నా దాన్నే కట్టుకున్నాడు. పెట్టె మూత పెట్టాలనుకున్నాడు. పెట్టెలోపలి అర కనిపించింది. ఆ అరలో పెళ్లాం తెచ్చిన డబ్బుంది. ఆ డబ్బు చూసినప్పుడల్లా సీలేరు గుర్తుకి వస్తుంది. అక్కడి కెళ్లిపోయిన మనుషులంతా గుర్తుకి వస్తారు. జగ్గడు తిట్టాడు, ముందంతా వస్తానని చెప్పి ఇప్పుడు పెళ్లాం ఏడుస్తుందని, ఉండిపోతావురా తొత్తు కొడకా అని. వాళ్లతో వెళ్లలేక పోయినందుకు వాడికి బాధగా ఉంది.

డబ్బు తీసి లెక్క పెట్టాడు. పద్దెనిమిది రూపాయలు, ఒక అర్ధరూపాయి పైన -- ఒక పాతపైసా.

తులసి ఏడుస్తుంది.

తులసి వేపు చూశాడు. పక్కవాటుగా పడుకుంది.

దీపం ఆరిపోతుందేమో అని వత్తి ఎగదోసి ఆముదం పోశాడు. ఆ వెలుతుర్లో మళ్లీ తులసిని చూశాడు. గుండెమీది చీర జారిపోయి కళ్లని కట్టేసినట్టుగా తులసి కనిపిస్తున్నది. ఒక్కసారి దగ్గిరగా గుండెకి అదుము కోవాలన్నంత ఉద్రేకం కలిగిస్తున్నది.

ఒక చొక్కా ఉంటే దాన్ని కూడా పెట్టిలోనించి తీశాడు. తువ్వాలుంటే దాన్నీ బయట పెట్టాడు. అరలో పెద్ద పైసా, అక అర్ధరూపాయి పడేశాడు.

దొంగలా శీరాములు పెళ్లాం తల దగ్గర కూర్చున్నాడు. ముఖం మీద చెయ్యి

పెట్టాడు. ముఖం పెట్టాడు. తాకబోయి మానుకున్నాడు. కదల్లేక పోయాడు. కూర్చున్నాడు. తెల్లారిపోతుందేమోనని భయపడ్డాడు. పెళ్లాం నిద్ర లేచిపోతుందేమోనని జంకు పుట్టింది. గడపలోకి వచ్చాడు. ఎక్కడో ఎవరి పక్కనో పడుకుంటే కాలుతోతన్ని వర్షంలోకి తోసేసిన కుక్క అరుపు వినిపిస్తున్నది. ఎవరో టార్చిలైటు వేసుకుని వీధిలోంచి పోతున్నాడు.

లోపలికి వచ్చి పెళ్లాం కాళ్ల దగ్గిర గోడకానుకుని కొంతసేపు కూర్చున్నాడు. మనసు ఇటూ అటూ ఊగుతున్నది. కుడిచేతిలో రూపాయలున్నాయి. మూడు మైళ్లు నడవాలి. తరవాత బస్సు దొరుకుతుంది. ఆ తరవాత రైలు. మళ్లీ అక్కడ దిగి బస్సు. సీలేరు కొండల్లోకి. జగ్గడు, కుష్టారావు, సూరిగాడు అందరూ ఉన్న సీలేరుకి.

నిద్రమబ్బు కమ్మినట్టయింది.

పొలం గట్టుమీంచి బుగత కేకవేస్తున్నాడు. పొలం బురదలో నల్లెద్దు నడవలేక పోతున్నది. ముల్లుగర్రతో పొడుస్తున్నాడు. అయినా నడవదు. పడి పోయింది. తోక విరిచినా కరిచినా లేవలేదు. బుగత పొలంలోకి దిగి ఎద్దు మెడలోని పలుపు విప్పి దాన్ని పొలంనించి తోలేశాడు. కాడికి తనని లాక్కెళ్లి కడుతున్నాడు. బలంగా లాక్కెడుతున్నాడు. రెండో పక్క చుక్కెద్దు. తనొక పక్క. హేయ్ అని అరిచి కొరడా విసురుతున్నాడు. పొలంలో మోకాల్లోతున అడుసు. అడుగుతీసి అడుగు వేయటం కష్టంగా ఉంది. వెన్నుమీద ముల్లుగర్రతో పొడుస్తున్నాడు. చుట్టూ మనుషులు చూస్తున్నారు. ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. ఇదేం అన్యాయమని ఎవ్వరూ అడగరు.

కూర్చున్నవాడు తల వాలి పడిపోతూ తులుక్కుపడి లేచాడు. భయంగా ఉంది. ఏమిటో అయింది. తెలీదు. అలిసిపోతున్నాడు. సర్దుకుని కూర్చున్నాడు. చేతిలో డబ్బులేదు. కిందపడింది.

డబ్బు తీసుకున్నాడు. ఇక్కడ ఈ ఊళ్లోఉండకూడదు. వెళ్లిపోవాలి. ప్రసిడెంట్ తినేస్తాడు. తిడతాడు. పొడుస్తాడు. పెళ్లాన్ని చూడనివ్వడు. ఇక్కడ పెళ్లానికి అంబలి కంటే ఇంకేం పెట్టలేడు. ప్రసిడెంటు అప్పు తీరదు. బతుకంతా వడ్డీ కిందే జమ. పారిపోవాలి. ఈ డబ్బు ఖర్చయిపోతే టిక్కెట్టుకు కూడా మరి పైసా దొరకదు. తులసి లేవకుండానే వెళ్లిపోవాలి. చొక్కా తువ్వాలూ పంచె మూట కట్టాడు. ఆ మూటలో డబ్బు పెట్టాడు.

చలి వేస్తున్నది. ఒళ్లంతా పచ్చి పుండులా ఉంది. తులసిని లాక్కుని పడుకుంటే ఎంతో బావుంటుందనిపిసున్నది. కాని ఈ యమలోకం నించి బయటపడలేదు.

మూటని గుండెకానించి పట్టుకున్నాడు శీరాములు. పెళ్లాన్ని మరొకసారి చూశాడు. అమాంతం కళ్లలో నీళ్లు తిరిగాయి. అయినా ఆగలేదు. వీధిలోకి వచ్చాడు. వానలేదు. ఆకాశాన్ని చూశాడు. అక్కడా అక్కడా తెల్లటి మేఘాలున్నాయి. నిండా చుక్కలు కనిపిస్తున్నాయి.

పాదాలు మునుగుతున్న లోతున వీధిలో పారుతున్న నీటిలో అడుగులు వేసుకుంటూ ముందుకు నడిచాడు శీరాములు. నీళ్లల్లో అడుగుల చప్పుడవు తున్నది. వీధిలోంచి వెళ్లకూడదనుకుని దారి మార్చాడు.

తాటికమ్మగొడుగు పట్టుకోవడం మరిచినందుకు నాలిక కరుచుకున్నాడు. వెనక్కి అడుగువేస్తే అనుకున్న పని నెరవేరదని వాడికి ఎక్కడలేని నమ్మకం. వాన వచ్చేలోపల బస్టాండుకి వెళ్లిపోవచ్చులే అన్న ధీమా కలిగింది. మేఘాలని చూసి వానకూడా రాదులే అనుకున్నాడు. బస్సు తప్పిపోకూడదని అంగలు సాచి ముందుకు నడిచాడు శీరాములు.

✻ ✻ ✻

*'ఆంధ్రప్రభ' వార పత్రిక 1968*